కథ

# ఆటోమేట్

**- ఐతా చంద్రయ్య**

**సమయస్ఫూర్తి అంటే ఏమిటో శ్రీనివాసును చూసి నేర్చుకోవాల్సిందే.. కాని ఏం లాభం? ఈ వ్యవహారంలో మాత్రం సంయమనమే శరణ్యమైంది. అయినా... సంయమనంకూడా సమయస్ఫూర్తిలో భాగమే గదా!**

సావర్కార్ చౌరస్తాలో హుషారుగా నుంచున్నాడు. మనసు మాత్రం - తొలకరి చినుకుకోసం ఎదురు చూస్తున్న చకోరపక్షిలా, పద్మకోసం ... ఆ పద్మాక్షి చూపుకోసం పరితపిస్తూంది. ఆ జవ్వని అవయవ సంపదను మనసారా గ్రోలాలని ఉవ్విళ్ళూరుతున్నాడు.

ఆ సుందర వదన రోజూ శివాజీ చౌక్‌లో నవ్వుతూ బస్సు దిగుతుంది. పక్కనున్న సావర్కార్ చౌరస్తా దాకా నాజూగ్గా నడిచొస్తుంది. అరవిరిసిన ముఖారవిందం. అరచేతులంత కళ్ళు, చెవులకు ఉయ్యాల లూగుతున్న మకర కుందనాలు, సన్నని నడుము, నున్నని ఒళ్ళు... చూడముచ్చటగా ఉంటుంది. ఒక్క మాటలో చెప్పాలంటే దివి నుండి భువికి దిగివచ్చిన దేవకన్యలాగుంటుంది.

సావర్కార్ చౌరస్తాలో ఆటో ఎక్కి, ఐదు కిలో మీటర్లు అరమరికలు లేకుండా ప్రయాణించి, ఫైర్‌స్టేషన్ వద్ద దిగిపోతుంది. అక్కడికి అతి దగ్గరలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో పాఠాలు చెబుతుంది. శ్రీనివాసు కూడా అదే చౌరస్తాలో, ఆవిడ ఎక్కిన ఆటోలోనే ఎక్కేసి అదే ఫైర్‌స్టేషన్ వద్ద దిగిపోతాడు. ప్రాథమిక పాఠశాలకు ఎదురుగా జూనియర్ కళాశాలలో జాలీగా లెక్చర్లిస్తుంటాడు. సాయంత్రంకూడా ఆవిడతోనే ఆటో ఎక్కి ఇదే సావర్కార్ చౌరస్తాలో దిగుతాడు. చూపులు కలిసిన శుభవేళా... పాటను నెమరేసుకుంటూ విడిపోతాడు. కలలో ఆవిడ ఒడిలో ఒరిగిపోతుంటాడు.

పాఠాల పంతులమ్మ, లెక్చర్ల లెక్చరర్... ఒకరంటే ఒకరికి ఏదో... ఇది. ఆ ఇదికి నిర్వచనం చెప్పించుకోవాలని శ్రీనివాసు తంటాలు పడుతున్నాడు. మొదటి మూడ్రోజులు ఆటోలో కాకతాళీయంగా కలుసుకున్నారు. ఆ తర్వాత కావాలనే కలిసి పయనిస్తున్నారు.

మొదటి రోజు ముఖ పరిశీలన, రెండో రోజేమో పెదాల రంగస్థలమ్మీద చిరునవ్వుల చిందులాట. మూడో రోజు పరిచయాలయ్యాక పిచ్చాపాటి కబుర్లు చెప్పుకున్నారు. ఆ తర్వాత అదే వరస కొనసాగింది.

అదిగో... పద్మ దళాయతాక్షి పద్మ వయ్యారంగా బస్సు దిగింది. శ్రీనివాసు గుండెల్లో తేనెజల్లు కురిసింది.

అదేమిటీ... రోజూ ఒంటరిగా వచ్చేది, ఈ రోజు మరో బురఖా లేడీ చేతిలో చెయ్యేసి జంటగా వస్తుందే! దోసిట్లోని దోరమామిడి పండు కదిలిపోతున్నట్టనిపించింది.

పద్మను కళ్ళతో పలకరించాడు. పెదాలు కదలకుండా జవాబిచ్చి ఒళ్ళంతా గిలిగింతలు పెట్టింది. కమ్మగా నవ్వింది. అప్పుడే ఆటో వచ్చి నుంచుంది. మొదట పద్మ, తర్వాత బురఖా బుర్రి, చివరగా శ్రీనివాసు ప్రవేశించారు. ఆటో ఝూమ్మంటూ బయలుదేరింది. శ్రీనివాసు చూపులు పద్మమీదనే కేంద్రీకృతమైనాయి.

''పానకంలో పుడకలా ఈవిడెవరూ?'' వెనక నుండి అడిగాడు సైగలతో.

''ఈమె నా ఫ్రెండ్... రజియా!'' ముందు నుండి పరిచయం చేసి సర్దుక్కూచుంది పద్మ.

వెన్నెలలొలికే పద్మ కళ్ళల్లో కళ్ళుగలిపి సరదాగా మాట్లాడాలనుంది కాని - భగవంతుడికీ భక్తుడికీ మధ్యన మాయాదేవిలా ఈ బురఖా ఒహటి.

ఆటో పరుగులు. చూపుల తచ్చాటలు.

ఆవిడ అంతరంగ తరంగాలను చదవాలనుంది. చూపులటు వైపు మళ్ళాయి. బురఖా అడ్డమొచ్చింది. ఆటో స్పీడందుకుంది.

శ్రీనివాసు బుర్రలో సమయస్ఫూర్తి చెమక్కు.

వెనకవైపు నుండి మెల్లిగా కుడిచెయ్యి వీపుల మీదుగా లేచింది.

ఎడమ భుజమ్మీదేదో పాకుతున్నట్టనిపించింది పద్మకు. చూపులటు మళ్ళినై. శ్రీనివాసు వేళ్ళు భుజమ్మీద భరతనాట్యం చేస్తున్నై.

''అమ్మ దొంగా!'' చెయ్యి లాగి పారేసింది.

రజియా చెయ్యి పైకి లేచింది. శ్రీనివాసు చెంప ఛెళ్ళుమంది. తేలుకుట్టిన దొంగలాగయ్యాడు. విధిలేక చూపులు రోడ్డు మీదికి మళ్ళినై.

మనసు కుతకుతలాడ్తుంది. చెంపమీద చీమ పాకుతున్నట్టుంది. కోపమొచ్చింది.

''ఛీ... చీమగ్గూడా లోకువయానా!'' కసిగా తన చెంపను తానే వాయించుకున్నాడు. చెంపమీదుంది చీమ కాదు పద్మ చూపుడు వేలు.

రజియాక్కోపమొచ్చింది. పద్మ చెంపను కసిగా గిల్లింది.

అబ్బా... మోటు! అంటూ కందిపోయిన చెంపను అరచేత్తో పట్టుకుంది పద్మ.

మనసుల్లో మంటలు లేవకముందే ఫైర్‌స్టేషన్ ముందు ఆటో ఆగింది. ముగ్గురూ దిగి చెట్టుకిందికి వచ్చారు. వాతావరణం హాయిగా ఉంది.

బురఖా కిలుక్కున నవ్వింది.

పద్మ పకపకా నవ్వింది.

ముద్దు గుమ్మల నవ్వుల తరగలకు పులకించిన కొమ్మలు మెప్పుకోలుగా తలలాడిస్తున్నై.

ఎరక్కపోయి ఇద్దరిమధ్య ఇరుక్కుపోయానేమిటి! ఇబ్బందిపడుతున్న శ్రీనివాసుకేం చెయ్యాలో అర్థం కాలేదు.

''మన డ్యూటీలకింకా సమయముంది గదా!'' అనగలిగాడు - పెదాల మీద చిరునవ్వు అతికించుకుని.

''డ్యూటీకి టైముంది గాని... మీ బండారం బద్దలయ్యేందుకింకా సమయం లేదు...'' గబుక్కున బురఖా తొలగించుకుంది. ''మీరిద్దరూ తోడు దొంగల్రా!'' రెండు చేతుల్తో చెరొకటి అంటించింది. డంగైపోవడం శ్రీనివాసు వంతైంది.

అరె... రజియా... రజియా కాదు, రజని. తోడబుట్టి కూడా పెరిగిన అల్లరి చెల్లి రజని... మొహం ఇంద్ర ధనస్సైంది.

ఇప్పుడెలా రియాక్టవాలో... సమయస్ఫూర్తి చప్పబడింది. కైలాస పర్వతాన్ని కళ్ళారా చూస్తున్నట్టు.

''నువ్వా రజనీ!'' నోరెళ్లబెట్టాడు.

చెల్లినీ, చెలినీ మార్చి మార్చి చూస్తున్నాడు.



''అవున్రా అన్నయ్యా.. నేనే! ఈ పద్మ నయన పూర్తి పేరు పద్మావతి. నా క్లోజ్ ఫ్రెండ్... తెల్సా!'' రజని కనుబొమ్మ లెగిరి పడ్డై.

''ఆ... అట్లానా!'' మరింత ఆశ్చర్యం.

''ఊ.. ఈ ఆటోమేట్ గురించి ఏదేదో చెప్పి ... ఆవిడ మనసులో నువ్వెలాగున్నావో కనుక్కొమ్మ న్నావు గదా! ఇది గూడా తక్కువ తినలేదు. నీ గురించి చాంతాడంత చెప్పి నీ మనసులో దాని స్థాన మేమిటో కనుక్కొమ్మని బతిమాలింది. ఇద్దరిచేత బతిమాలించుకున్నాను. ఇప్పుడు తేల్చి పారేశాను ...''

''ఏం తేల్చావే!'' పద్మావతి కనుబొమ్మలు తుమ్మెద రెక్కల్లా టపటప లాడ్డై.

''మీరిద్దరూ ఇద్దరేనని.''

''నీ మొహం. ఇద్దరు ఇద్దరు గాక ముగ్గురౌ తారా?''.

''అవుతారమ్మాయ్'' పద్మ చెంపమీద చిటికే సింది రజని. ''తోడు దొంగలిద్దరు ఈయేడు ఒకటై పోతే వచ్చే యేటికి ముగ్గురైపోతారు. నలదమయం తుల్లా ప్రేమించుకున్నారు. నాది కేవలం హంస రాయబారం.''

సిగ్గుల భారంతో పద్మావతి బుగ్గలు ఎరు పెక్కెనై. ఆగలేక అక్కడే ఆమె చెయ్యందుకున్నాడు శ్రీనివాసు. చెట్టు మీంచి రాలిన పూవులా అతని గుండెల మీద వాలింది జవ్వని.

''ఆ... ఆగండాగండి...'' చూపుడు వేలును పెదాల కానించుకుంది రజని... ''ఆటోమేట్స్ ఆటోమేటిగ్గా ఆలుమగలై పోతున్నారు గాని... ఇది పబ్లిక్ ప్లేస్. పడ్డగది కాదు.''

''అమ్మ పిడుగా! సాయం చేస్తానని మాయం చేస్తున్నావా?'' రజని కుడిచెవి అందుకున్నాడు శ్రీనివాసు.

''ఇతడు మీ అన్నయ్యని ఒక్కసారిగూడా చెప్పలేదు'' ఎడమచెవి అందుకుంది పద్మావతి.

''వామ్మో... ఇద్దరి మధ్య ఇరుక్కుపోయా ను''. పద్మావతి ముక్కందుకుంది రజని... ''నేను నీ అర్ధమొగుణ్ని సుమా. చెప్పినట్టు వినకపోతే ముక్కూడబీకి మూలకేస్తా... ఖబడ్దార్!'' ముక్కు విడిచి జడ అందుకుంది.

నడిబజారు పక్కన నవ్వుల పువ్వులు జలజలా రాలిపడ్డై.